ప్రభుత్వానికి పసుపు రైతుల గోస పట్టదా?

- గిట్టుబాటు ధరలేక అల్లాడుతున్న రైతాంగం
- క్వింటాల్‌కు రూ.15 వేల హామీ ఏమైంది?
- ఎమ్మెల్సీ కవిత నిలదీత

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): గిట్టుబాటు ధరలేక నిజామాబాద్ పసుపు రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. వారు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నా పట్టించుకోవడంలేదు ఎందుకని నిలదీశారు. ఎన్నికల ముందు క్వింటాల్‌కు రూ.15 వేలు ఇస్తామని రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చడంలేదు ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఓట్ల కోసం మాయమాటలు చెప్పిన కాంగ్రెస్, బీజేపీ గద్దెనెక్కిన తర్వాత పసుపు రైతుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పసుపునకు మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.9 వేలు కూడా దక్కకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు కనీస చర్యలు తీసుకోకుండా అన్నదాతను నయవంచనకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్వింటాల్ పసుపునకు రూ.15 వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

అర్వింద్‌కు పరామర్శించే తీరికలేదా?

పసుపు బోర్డు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ఎంపీ అర్వింద్ గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న రైతులను ఎందుకు పట్టించుకోవడంలేదు? కనీసం వారిని పరామర్శించి భరోసా ఇవ్వడంలేదెందుకు? అని కవిత సూటిగా ప్రశ్నించారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడంలేదని అన్నారు. పసుపు ధర పెంచుతామని, రైతులను ఆదుకుంటామని బోర్డు ప్రారంభోత్సవం సమయంలో చెప్పిన బండి సంజయ్ ఇప్పుడు ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు.

డీఎన్టీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

సంచార జాతులకు డీఎన్టీ (డీనోటిఫైడ్ ట్రైబ్స్) సర్టిఫికెట్లు జారీ చేయాలని ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ కోకన్వీనర్ బోళ్ల శివశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ సంచార జాతుల సంఘం నేత కోల శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. సంచార జాతుల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తాలని విజ్ఞప్తిచేశారు. డీఎన్టీ సర్టిఫికెట్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందడంలేదన్నారు. కవితను కలిసిన వారిలో సంచార జాతుల సంఘం నేతలు ఉన్నారు.

పసుపు ధరల్లో దళారీ దందా!

- రైతును సతాయిస్తున్న దళారులు
- ఏజెంట్లు, కొనుగోలుదారులు కుమ్మక్కు
- ఈ-నామ్'ను ముంచేస్తున్న వైనం
- గిట్టుబాటు కాక రైతాంగం గగ్గోలు

నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు రాశులు

నిజామాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గిట్టుబాట ధర అందక పసుపు రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ పాలకవర్గం, అధికారులు అంతా కలిసి ఈ నామ్‌కు పంగనామాలు పెట్టి తమను దగా చేస్తున్నారని పసుపు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పసుపు కొనుగోలుదారులంతా సిండికేట్‌గా మారి రైతులను నిలువునా ముంచేస్తున్నారు. పసుపు నాణ్యతను పక్కన బెట్టి రైతులను ముంచడమే ప్రధాన ఎజెండాగా ధరలను నిర్ణయిస్తున్నారు. క్వింటాల్ పసుపు ధర రూ.15 వేలు ఇవ్వాలని రైతులు కోరుతుంటే.. అందులో సగం కూడా చేతికి రావడం లేదు. మార్కెట్‌యార్డులో కొమ్ముకు రూ.9,500, మండకు రూ.8 వేలుగా కటాఫ్ ధరగా నిర్ణయించారు. పసుపు కొనుగోలుదారులు అంత కంటే ఎక్కువ ధరకే బిడ్డింగ్ వేయాల్సి ఉంటుంది. కానీ మార్కెట్‌లో ఇందుకు విరుద్ధంగా కొనసాగుతున్నది. వ్యాపారులు కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కై రైతును బలి పశువును చేస్తున్నారు. బహిరంగంగానే ఇంత దారుణాలు జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు స్పందించడమే లేదు. ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు. 9 నెలలు కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేకపోవడంతో ఏం చేయాలో తోచక పసుపు రైతులు మనోవేదనకు గురవుతున్నారు. దళారుల మాయాజాలంతో రోజుల తరబడి వ్యవసాయ మార్కెట్‌లో పడిగాపులు కాయలేక అడిగిన ధరకే అప్పజెప్పి నష్టాలతో ఇంటి ముఖం పడుతున్నారు.

కొత్త రకం దోపిడీ

నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చే పసుపు మొత్తాన్ని కొనుగోలు చేయకుండా కొద్ది మొత్తాన్నే కొనుగోలు చేస్తున్నారు. ఒక కమీషన్ ఏజెంట్ దుకాణానికి 20 మంది రైతులు పసుపు తీసుకొస్తే, అందులో ఒకరిద్దరి పసుపు ఉత్పత్తులకే ధర (మార్కెట్‌లో కటాఫ్ విధించిన రేట్) కోట్ చేస్తున్నారు. మిగతా వారి పసుపునకు ధర కోట్ చేయడం లేదు. వ్యాపారులు ధర పెట్టక పోవడంతో ఆందోళనకు గురవుతున్న రైతులు.. కమీషన్ ఏజెంట్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ధర కోట్ చేయలేదని తెలుసుకుని మరుసటిరోజు మార్కెట్‌కు వస్తున్నారు. ఇలా నాలుగైదు రోజులు మార్కెట్‌కు తిరిగి తిరిగి రైతులు వేసారిపోతున్నారు. పసుపు ఉత్పత్తులను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడం, రోజుల తరబడి మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్న రైతులు కమీషన్ ఏజెంట్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్‌లో నిర్ణయించిన కటాఫ్ ధర కంటే రూ.1500-2,000 మేర తక్కువ ధరకు కొనేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నారని కమీషన్ ఏజెంట్లు చెప్తున్నారు. విసిగిపోయిన రైతులు తక్కువ ధరకే అమ్ముకుని కన్నీళ్లతో ఇంటిముఖం పడుతున్నారు. ఇలా కొత్తరకం ఎత్తుగడతో ఈ-నామ్‌కు ఎగనామం పెట్టి ఆఫ్‌లైన్‌లో కొనుగోళ్లు చేస్తూ వ్యాపారులు భారీగా దండుకుంటున్నారు.

స్పందించని బీజేపీ ఎంపీ అర్వింద్

పసుపుబోర్డు పేరిట బీజేపీ తెగ హంగామా చేసింది. బోర్డు వచ్చిందంటూ ఆ పార్టీ నేతలు సంబురాలు జరిపారు. కానీ, రైతులు నష్టపోతుంటే ఆ పార్టీ ఎంపీ అర్వింద్ సహా నేతలే వరూ స్పందించడం లేదు. గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతుంటే పసుపు బోర్డు చైర్మన్, కార్యదర్శి కనీసం పట్టించుకోవడం లేదన్న ఆగ్రహం వ్యక్తమవుతున్నది. పసుపు బోర్డు ఘనత తనదేనంటూ ప్రగల్భాలు పలికిన ఎంపీ అర్వింద్ ఇంతవరకూ పసుపు రైతుల ఆవేదనపై నోరు మెదపడమే లేదు.

ఖరీదుకు అస్తలేరు

రెండ్రోజుల సంది మార్కెట్లో పడిగాపులు కాస్తున్నా. పట్టించుకునేటోడే లేడు. ఖరీదు చేసేందుకు అస్తలేరు. రోడ్డు మీదికి అచ్చి కూసుంటెనే మాట్లాడుతుండ్రు. ధర లేక మస్తు ఇబ్బంది అయితున్నది. పసుపు పంట పండించాల్నా వద్దా అని ఆలోచన జేయాల్సి అస్తున్నది.

- పోశెట్టి, పసుపు రైతు, తొండాకూర్, డొంకేశ్వర్

అంతా సిండికేట్ అయిండ్రు

వ్యాపారులంతా సిండికేట్ అయ్యిండ్రు. పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల ధర పెడ్తరనుకున్నం. తక్కువల తక్కువ రూ.11 వేలు అయినా రాకపోదా అనుకున్నం. మార్కెట్‌కు అత్తే ఏం పాడైంది. గా సేట్లు అచ్చి ఆరు వేలు, ఏడు వేలు అని చెప్తుండ్రు. పూటకొకళ్లు అచ్చి బేరమాడుతుండ్రు. రైతు కష్టంల ఉంటే ఈడ పట్టించుకునేటోళ్లే లేరు.

- గంగాధర్, పసుపు రైతు, జగిత్యాల

పెట్టిన పెట్టుబడి అత్తలే

పసుపు పంటకు పండియ్యాల్నంటే మస్తు ఖర్సయితది. దున్నుడు, మందులు, కూలీలకు లచ్చన్నర దాకా పోతది. అంత ఖర్సు వెట్టి పండించిన పసుపును మార్కెట్లకు తెత్తే ధరే అత్త లేదు. ఈ రేట్లతో అచ్చే డబ్బులు ఖర్సుకూ సరిపోతలేవు. గింత గోస ముందెన్నడూ సూడలే. కండ్లకు నీళ్లొత్తున్నయ్.

- మల్లవ్వ, పసుపు రైతు, నిర్మల్ జిల్లా

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని 63వ జాతీయ రహదారిపై పాత బస్టాండ్ వద్ద బైఠాయించిన పసుపు రైతు

పసుపు రైతుల పోరుబాట

- మద్దతు ధర కోసం ఆందోళన
- మెట్‌పల్లిలో భారీ ర్యాలీ.. రోడ్డుపై బైఠాయింపు
- ఆర్డీవో హామీతో శాంతించిన అన్నదాతలు

మెట్‌పల్లి, మార్చి 11 : పండించిన పంటకు మద్దతు ధర లభించడం లేదని పసుపు రైతులు పోరుబాట పట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై అధికారంలోకి వచ్చాక నోరుమెదపని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. తక్షణమే పసుపునకు మద్దతు ధర ప్రకటించి తమను ఆదుకోవాలని మంగళవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రోడ్డెక్కారు. రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పసుపు రైతులు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి 63వ జాతీయ రహదారి మీదుగా ర్యాలీగా పాతబస్టాండ్‌కు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించారు. పసుపునకు క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని, ఎంఐఎస్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కేంద్రాలను ప్రారంభించి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని రైతులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ గానీ, ఆర్డీవో గానీ వస్తే తమ గోడును చెప్పుకుంటామని, అంత వరకు ధర్నా విరమించేదిలేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో శ్రీనివాస్ అక్కడికి రాగా, రైతులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో రైతు ఐక్యవేదిక నాయకులు, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నిజామాబాద్ మార్కెట్ యార్డు ముట్టడి

కంఠేశ్వర్, మార్చి 11: గిట్టుబాటు ధర కోసం పసుపు రైతులు మంగళవారం కూడా ఆందోళనకు దిగారు. పసుపు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని నిజామాబాద్ మార్కెట్ యార్డు కార్యాలయాన్ని ముట్టడించారు. వ్యాపారులు సిండికేట్ అయి ధర రాకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న దోపిడీపై కలెక్టర్ పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

హామీలను నెరవేర్చాలి

అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమైనా రైతు పక్షపాతమే అని చెప్తున్నారే తప్ప వారికి చేసిందేమీ లేదు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేర్చాలి. మద్దతు ధరల జాబితాలో పసుపు పంటను చేర్చాలి. అప్పుడే పసుపు రైతులకు మేలు జరుగుతుంది. మార్కెట్‌లో పంట విక్రయించిన తర్వాత డబ్బులు చెల్లించేందుకు వ్యాపారులు 2 శాతం క్యాష్ కటింగ్ చేయడం సరికాదు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

- మారు జనార్దన్, పసుపు రైతు, కోనరావుపేట, మెట్‌పల్లి మండలం, జగిత్యాల జిల్లా

పసుపు గిట్టుబాటు ధరకు చర్యలు

పసుపు బోర్డు ఎండీ భవానీశ్రీ

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను పసుపు బోర్డు ఎండీ భవానీశ్రీ ఆదేశించారు. పసుపు రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈనామ్ పోర్టల్‌లో పసుపు పంటకు వచ్చే గరిష్ఠ ధరను ఆధారంగా చేసుకొని, నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా రైతులకు న్యాయమైన ధర లభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్ర మోహన్, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

నీళ్లివ్వకుండా నట్టేట ముంచుతారా?

- ఎమ్మెల్యే అయిలయ్యా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమాయే..?
- కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మల్లాపురం రైతుల ఆగ్రహం

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆ పార్టీ నాయకులు

యాదగిరిగుట్ట, మార్చి11: అధికారంలోకి రాగానే సాగు నీళ్లందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, కానీ గెలిచిన తర్వాత నీళ్లివ్వకుండా పంటలు ఎండబెడుతున్నదని రైతులు మండిపడుతున్నారు. గ్రామంలో సాగు నీళ్లు లేక, లో ఓల్టేజీ సమస్యతో 150 ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయని యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట మండలం మల్లాపురం రైతులు కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అమ్మమ్మ వాళ్ల ఊరని, గెలిచిన వెంటనే గోదావరి జలాలను కాల్వ ద్వారా అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాడని, కానీ ఇప్పుడు పంటలు ఎండిపోతున్నా ఇటు వైపు చూడటం లేదని మండిపడుతున్నారు. నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచాడని వాపోయారు. మల్లాపురం గ్రామ పంచాయతీ పరిధి సురెండెం బావి ప్రాంతంలో 25 మంది 150 ఎకరాల్లో వరి వేయగా నీళ్లు లేక, లోఓల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోయాయి. ఎండిన పంటలను పశువుల మేతకు వదలాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు కర్రె ఎల్లమ్మ, మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన వరి పంటలను మంగళవారం బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్యతో పాటు ఆ పార్టీ నాయకులు పరిశీలించారు.

నీళ్లొస్తయంటే రెండెకరాల్లో వరి వేసిన

కాంగ్రెస్‌ను గెలిపిస్తే గ్రామానికి నీళ్లిస్తామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నమ్మించి ఓట్లేసుకున్నడు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం కాల్వ నుంచి నీళ్లు వస్తాయని నాకు ఉన్న రెండెకరాల భూమిలో వరి వేసిన. రెండు నెలలుగా బావివద్దనే ఉంటున్న. కానీ ఒక్క చుక్క నీళ్లురాలె. కరెంటు కూడా సరిగ్గా వస్తలేదు. నాకు రూ.2 లక్షల క్రాప్ లోన్ ఉంది. కానీ రుణమాఫీ కాలేదు. రైతు భరోసా ఇస్తలేరు. కాంగ్రెస్ సర్కార్ రైతులను నానా ఇబ్బంది పెడుతున్నది.

-కర్రె ఎల్లమ్మ, రైతు, మల్లాపురం, యాదగిరి గుట్ట మండలం

కాలువలో మట్టిని తీస్తున్న రైతులు

రైతన్నల డబ్బుతో కాలువలకు మరమ్మతు

ఫలించిన ప్రయత్నం.. వందల ఎకరాలకు సాగు నీరు

ఆదిలాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఉన్నా నీరు పోయకపోవడంతో వందల ఎకరాల్లో జొన్న పంట ఎండిపోయే ప్రమాదం నెలకొన్నది. చెరువులో నీరు పుష్కలంగా ఉంది. కానీ కాలువకు గండి పడడం, మట్టి, గడ్డి, పిచ్చిమొక్కలు మొలవడంతో నీరు పారే పరిస్థితి లేదు. కాలువకు మరమ్మతులు చేయాలని అధికారులను వేడుకున్నా స్పందన కరువైంది. దీంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలే స్వయంగా సోమవారం కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. తలా కొంత డబ్బులు జమ చేసుకుని కాలువ గండిని పూడ్చి వేయడంతోపాటు జేసీబీ ద్వారా మట్టి, పిచ్చి మొక్కలు తొలగించారు. కాలువల్లోకి నీరు పారింది. వంద ఎకరాల జొన్న పంటకు సాగు నీరందింది.

వేలం ధాన్యం గడువు పొడిగింపు

మరో మూడు నెలల గడువు ఇచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ): 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి వేలం ద్వారా విక్రయించిన ధాన్యం ఎత్తేందుకు బిడ్డర్లకు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మిల్లుల్లో ఉన్న వేలం ధాన్యం ఎత్తేందుకు బిడ్డర్లకు మరో మూడు నెలల గడువు ఇస్తున్నట్టు పేర్కొంది. దీంతో గడువు పొడిగించడం నాలుగోసారి కావడం గమనార్హం. గతేడాది ఫిబ్రవరి 23న 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేయగా ఏడాది పూర్తయినా వేలం ధాన్యాన్ని బిడ్డర్లు ఎత్తలేకపోయారు. దీంతో మరోసారి గడువు పొడిగించాలని కోరగా ప్రభుత్వం అంగీకరించింది.

నిజాం షుగర్స్ కార్మికుల ముందస్తు అరెస్టు

- న్యాయం కోసం సీఎంను కలువాలని నిర్ణయం
- అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు

బోధన్, మార్చి 11: న్యాయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును మంగళవారం కలువాలనుకున్న నిజాం షుగర్స్ కార్మికులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పరిధిలోని శక్కర్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి కార్మిక నాయకుల ఇండ్లల్లోకి వెళ్లి అరెస్టు చేశారు. నిద్రిస్తున్న వారిని లేపి అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. 2015 డిసెంబర్ 23న నిజాం షుగర్స్‌కు ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించడంతో అప్పటివరకు ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు రోడ్డునపడ్డారు. నిబంధనల మేరకు లేఆఫ్ కాలానికి నిర్దేశిత మొత్తంలో ప్రైవేట్ యాజమాన్యం కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉండగా, పదేండ్లుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ సమస్యను సీఎం రేవంత్‌కి వివరించి వేతనాలు చెల్లించే ఏర్పాటుచేయాలని కోరేందుకు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాలని కార్మిక నాయకులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లకుండా కార్మిక సంఘాల నేతలను అర్ధరాత్రి అరెస్టు చేశారు. సీఎం, మంత్రికి గోడు చెప్పుకోవాలని అనుకున్న తమను పోలీసులు అడ్డుకోవడంపై కార్మిక నాయకులు మండిపడ్డారు. నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

బోధన్ పోలీసుస్టేషన్‌లో నిజాం షుగర్స్ కార్మికులు

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

కుమారస్వామి (ఫైల్)

చిట్యాల, మార్చి 11 : అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోత్కూరి కుమారస్వామి (35) తన కున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పత్తి, మిర్చి సాగు చేశాడు. గత మూడేళ్లుగా సరైన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చినవి, గతంలో ఉన్నవి కలిపి సుమారు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెంది మంగళవారం తన పంట చేను సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల సివిల్ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

వరికి ఆరుతడి పద్ధతిలో నీళ్లందించాలి

రైతులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): వరికి ఆరుతడి పద్ధతిలో నీళ్లందించాలని మంత్రి తుమ్మల రైతులకు సూచించారు. దీని వల్ల నీటి ఎద్దడిని అధిగమించడంతో పాటు, అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. స్వల్పకాలిక వరి రకాలను నవంబర్‌లో సాగు చేస్తే మార్చి మొదటి వారానికి కోతకు వస్తాయని తెలిపారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని గోదాములు వంద శాతం వినియోగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కందులు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

- రేవంత్‌రెడ్డి.. రైతులకు చేసిన మేలేం లేదు

కట్టంగూర్, మార్చి 11 : నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం గార్లబాయిగూడేనికి చెందిన రైతు కంచర్ల లింగారెడ్డి ఎండిపోతున్న పంటను చూసి ఆవేదన చెందుతున్నాడు. 'నాకున్న 4 ఎకరాల్లో రూ.1.35లక్షలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే.. నీళ్లు లేక, కరెంట్ సరిగ్గా రాక పంటంతా పొట్ట దశలోనే ఎండిపోయింది. రూ.10వేలు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొన్నా.. రెండు గుంటలు కూడా పారుతలేదు. పంటలు ఎండి అరిగోస పడుతున్నాం. రేవంత్‌రెడ్డి రైతులకు చేసిందేమీ లేదు. మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతులకు బతుకు. లేకుంటే మట్టిపాలే' అంటూ వాపోయాడు.

- 600 ఫీట్లు బోరు వేసినా నీళ్లు అత్తలేవ్

పలిమెల, మార్చి11: గత పదేళ్లలో నీటి కోసం గోస పడలే. ఇప్పుడు మళ్లీ నీళ్ల కరువు అచ్చింది. 600 ఫీట్లకు పైగా బోరు వేసినా ఫలితం లేకపోయిందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలకు చెందిన రైతు బడిషా భాస్కర్ ఆవేదన వ్యక్తంచేశాడు. పక్కనే గోదావరి నది.. తలాపునే మేడిగడ్డ ప్రాజెక్టు.. అయినా నీళ్ల తిప్పలు తప్పుతలేవని వాపోయాడు. పలిమెలలో తనకున్న 4 ఎకరాల భూమిలో మిరపతోట వేసినట్టు తెలిపాడు. మేడిగడ్డ ప్రాజెక్టును ఎండబెట్టడంతో నీళ్ల కరువు వచ్చి బోరు అడుగంటి చేను ఎండిపోయిందని వాపోయాడు. కేసీఆర్ హయాంలో మేడిగడ్డ నిండుకుండలా ఉండేదని, సంతోషంగా ఎవుసం చేసుకునేటోళ్లమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నాడు.

- ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

చౌటుప్పల్, మార్చి 11 : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని, ఉత్తరభాగంలో లీ సర్వే చేయాలని ట్రిపుల్ ఆర్ బాధితులు మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్, వలిగొండ, రాయగిరితోపాటు గజ్వేల్ తదితర ప్రాంతాల బాధితులు పెద్దఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ఇప్పటికే నేషనల్ హైవేలకు, విద్యుత్తు లైన్లకు, కాల్వలకు భూములు కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు.